క్లుప్తంగా

జెడ్పీ హైస్కూల్ హెచ్ఎంల నియామకం


పెనమలూరు హెచ్ఎం సుధారాణి

పెనమలూరు: మండలంలో పెనమలూరు, యనమలకుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు నూతన ప్రధానోపాధ్యాయులు బదిలీపై వచ్చారు. పెనమలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు కంకిపాడు నుంచి జీబీకే.సుధారాణి బదిలీపై రాగా పెనమలూరులో ఇంతకాలం హెచ్ఎంగా ఉన్న వై.దుర్గా భవాని పమిడిముక్కల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు బదిలీ అయ్యారు. యనమలకుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పెడసనగల్లు జిల్లా పరిషత్ పాఠశాల నుంచి కె.శిరీష బదిలీపై వచ్చారు. ఇక్కడ ఇన్చార్జ్ హెచ్ఎంగా ఉన్న రమేష్ బదిలీ అయ్యారు.

పాఠ్య పుస్తకాలు సరఫరా



పెనమలూరు: మండలంలోని ప్రభుత్వ పాఠశాలకు పాఠ్యపుస్తకాలు సరఫరా చేశామని మండల విద్యాశాఖ అధికారి శేషగిరిరావు తెలిపారు. ఆయన శుక్రవారం వివరాలు తెలుపుతూ జూన్ 12వ తేదీ నుంచి అన్ని ప్రభుత్వ పాఠశాలలు పునః ప్రారంభమవుతాయని తెలిపారు. ఇది దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం పాఠ్యపుస్తకాలు సరఫరా చేసిందని అన్నారు. మండలంలోని 35 పాఠశాలల్లో దాదాపు 5 వేల మంది విద్యార్థులు చదువుతున్నారని తెలిపారు. విద్యార్థులకు 22,359 పాఠ్యపుస్తకాలు రాగా వాటిని శుక్రవారం ఆయా పాఠశాలలకు వాహనల్లో పంపామన్నారు. అన్ని సబ్జెక్టులకు పాఠ్యపుస్తకాలు వచ్చాయన్నారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాఠ్యపుస్తకాలు భద్రపరిచి విద్యార్థులకు సకాలంలో పంపిణీ చేయాలని తెలిపారు.

సంపద తయారీ కేంద్రాల పరిశీలన



ఉంగుటూరు(గన్నవరం): ఉంగుటూరు మండలం నాగవరప్పాడు, వెన్నూతల, తేలప్రోలు గ్రామాల్లోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను శుక్రవారం డిప్యూటీ ఎంపీడీఓ వీ.దిలీప్కుమార్ పరిశీలించారు. తడి, పొడి చెత్త సేకరణ ప్రక్రియను పర్యవేక్షించిన ఆయన సిబ్బందికి సలహాలు, సూచనలు ఇచ్చారు. వర్మి కంపోస్ట్ ఎరువుల తయారీ ద్వారా గ్రామ పంచాయతీలకు ఆదాయం సమకూర్చుకోవాలని సూచించారు. స్వర్ణ పంచాయతీ వెబ్సైట్లో ఇంటి పన్ను చెల్లిస్తున్న వారి ఆధార్, ఫోన్ నంబర్లు లింక్ చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు. ఇప్పటికే 90 శాతం నమోదు ప్రకియ ముగిసిందని, మిగిలిన పది శాతం త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయా గ్రామాల సర్పంచ్లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

పశుగ్రాసం కొరత లేకుండా చూడాలి



కంకిపాడు: పశుగ్రాసం కొరత లేకుండా పశుపోషకులు జాగ్రత్తలు వహించాలని ఏఎంసీ చైర్మన్ అన్నే ధన రామకోటేశ్వరరావు కోరారు. పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఉప్పలూరు పశు వైద్య శాల ప్రాంగణంలో రైతులకు పశుగ్రాసం విత్తనాలు, పశువుల దాణాను శుక్రవారం పంపిణీ చేశారు. ధన రామకోటేశ్వరరావు మాట్లాడుతూ వ్యవసాయానికి అనుబంధంగా ఉన్న పాడి పరిశ్రమను పశుపోషకులు లాభదాయకంగా మార్చుకోవాలన్నారు. 75 శాతం రాయితీపై అందించే గడ్డి విత్తనాలను సద్వినియోగం చేసుకుని పశుగ్రాసం కొరత లేకుండా చూడాలన్నారు. మేలైన సంరక్షణతో పాడి వృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ లాం సోనియా, ఈడుపుగల్లు పశువైద్యాధికారి డాక్టర్ కె.మాధవరావు, ఉప్పలూరు పశువైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడులోని పలు ప్రాంతాల్లో శనివారం ఉదయం 8.30 గంటల నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఏఈ పరమేశ్వరరావు శుక్రవారం తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతులు, నూతన స్తంభాల ఏర్పాటు నిమిత్తం గ్రామంలోని చిన్మయి ధ్యానమందిరం, వాటర్ ట్యాంక్ రోడ్డు, పటేల్వారి వీధి, ఎస్సీఐ ఏరియా, రంగా బొమ్మ సెంటర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నామని వినియోగదారులు సహకరించాలని కోరారు.

ట్యాంకు నిర్మించారు.. విస్తరణ మరిచారు

- 14 ఏళ్ల కిందట ఓవర్హెడ్ ట్యాంకు నిర్మాణం
- పైపు లైన్ విస్తరణ, మోటార్ ఏర్పాటు చేయకపోవడంతో నిరుపయోగం
- శివారు ప్రాంతాలకు అందని తాగునీరు
- పాలకులు, అధికారుల నిర్లక్ష్యంతో ప్రజలకు ఇబ్బందులు


నిరుపయోగంగా మారిన వాటర్ ట్యాంకు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం ప్రసాదంపాడు నుంచి కానూరు వెళ్లే డొంక రోడ్డులో మండల పరిషత్ పాఠశాల సమీపంలోని వాటర్ ట్యాంక్ పాలకులు, అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. మేజర్ పంచాయతీ అయిన ప్రసాదంపాడు గ్రామంలోని పలు ప్రాంతాల్లో ఇప్పటికీ పూర్తి స్థాయిలో తాగునీరు అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు.

సమస్య ఇదీ..

నగరానికి ఆనుకుని ఉన్న ఈ మేజర్ పంచాయతీలో సుమారు 40 వేలకు పైగా జనాభా నివసిస్తున్నారు. గ్రామం మొత్తానికి పూర్తి స్థాయిలో సురక్షిత తాగునీరు అందించడంలో పంచాయతీ విఫలమవుతుందని పలువురు విమర్శిస్తున్నారు. గ్రామం మొత్తానికి కేవలం 90, 40 వేల లీటర్ల సామర్థ్యం ఉన్న వాటర్ ట్యాంకుల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారు.
ఈ తాగునీరు కూడా ప్రధాన గ్రామం వరకే పరిమితం కావడంతో కాల్వగట్టు ప్రాంతవాసులు, శివారు ప్రాంతవాసులకు తాగునీటి కష్టాలు తప్పడం లేదు. సురక్షిత తాగునీరు అందని పలు ప్రాంతాల వారికి భారమని తెలిసినా మినరల్ వాటర్ క్యాన్లే దిక్కు అయ్యాయి.

14 ఏళ్ల క్రితం ఓవర్హెడ్ ట్యాంకు నిర్మించినా..

14 ఎళ్ల క్రితమే ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణాన్ని పూర్తి చేసినా ఇప్పటికీ వాటర్ పైప్లైన్ కనెక్షన్కు నోచుకోక అలంకారప్రాయంగా తయారైంది. గ్రామంలో తాగునీటి సమస్యలు పరిష్కరించేందుకు 2011లో అప్పటి పంచాయతీ బోర్డు ఆధ్వర్యంలో 1.20 లక్షల లీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్యాంకు నిర్మాణం జరిగింది. మండల పరిషత్ పాఠశాల సమీపంలోని కామన్ స్థలంలో అప్పటి పాలవకర్గం ఏకగ్రీవంగా తీర్మానం చేసి ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణం చేపట్టి పూర్తి చేశారు. ఇది జరిగి 14 సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటి వరకూ ఈ ట్యాంకు ప్రారంభానికి మాత్రం నోచుకోలేదు.

> **చర్యలు తీసుకుంటాం**
>
> మండల పరిషత్ పాఠశాల సమీపంలోని వాటర్ ట్యాంక్కు పైప్లైన్ కనెక్షన్ అంశాన్ని పాలకవర్గ సమావేశంలో ప్రవేశపెడతాం. త్వరలో అంచనాలు రూపొందిస్తాం. ఈ ట్యాంక్ అందుబాటులోకి తీసుకురావడానికి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి అవసరమైన చర్యలు తీసుకుంటాం. కాల్వగట్టు ప్రాంతాల్లో మోటారు బోర్ల ద్వారా తాగునీటిని అందిస్తున్నాం. వాటర్ పైప్లైన్లను తరుచూ పరిశీలించి మరమ్మతులు నిర్వహిస్తున్నాం.
>
> – రాజేంద్రప్రసాద్, పంచాయతీ కార్యదర్శి.

ఈ పనులు చేసేందుకు ఇన్నేళ్లా..

వాటర్ పైప్లైన్ విస్తరణ జరగక, ట్యాంక్కు మోటారు ఏర్పాటు చేయకపోవడంతో తాగునీటి సమస్య కొనసాగుతోంది. ఫలితంగా శివారు ప్రాంత ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. లక్షల్లో ప్రజాధనం వృథా అవుతోందని గ్రామస్తులు విమర్శిస్తున్నారు.

వాటర్ క్యాన్లే దిక్కు

గ్రామంలోని పలు ప్రాంతాల్లో ఇప్పటికి పూర్తి స్థాయిలో తాగునీరు అందకపోవడంతో మినరల్ వాటర్ క్యాన్లపై ఆధారపడుతున్నారు. తాగునీటికి రోజుకు 2 నుంచి 3 వాటర్ క్యాన్లకు డబ్బులు వెచ్చించలేకపోతున్నామని పలు ప్రాంతాల వాసులు వాపోతున్నారు.

పైపులైన్ విస్తరిస్తే ఈ ప్రాంతాలకు మేలు..

నిరుపయోగంగా మారిన ఈ వాటర్ ట్యాంకును అందుబాటులోకి తీసుకొచ్చి గ్రామంలో తాగునీటి సమస్యలను పరిష్కరించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ఈ వాటర్ ట్యాంకు నుంచి పైప్లైన్ విస్తరణ చేస్తె డైరీ ఫారమ్ రోడ్డు, సాయిబాబా ఆలయం ఏరియా, సెయింట్ ఆన్స్ పాఠశాల ప్రాంతం, బీఎంపీఎస్ రోడ్డు, పాళ్ల బజారు, మండల పరిషత్ పాఠశాల ప్రాంతాల్లో తాగునీటి సమస్యలు పరిష్కారమవుతాయని గ్రామస్తులు చెబుతున్నారు. ఈ సమస్యపై పాలకులు, అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని ట్యాంకు ప్రారంభించడానికి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కిశోర బాలికలు పొదుపు అలవర్చుకోవాలి


వణుకూరులో పొదుపుపై మాట్లాడుతున్న మోహనలక్ష్మి

పెనమలూరు: కిశోర బాలికలు పొదుపు చేయటం నేర్చుకోవాలని డీఆర్డీఏ వెలుగు క్లస్టర్ కోఆర్డినేటర్ బి.మోహనలక్ష్మి అన్నారు. కిశోర వికాసం సమ్మర్ క్యాంప్లో భాగంగా శుక్రవారం వణుకూరు గ్రామంలో కిశోర బాలికలకు ఆర్థిక అంశాల నిర్వహణ- పొదుపుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మోహనలక్ష్మి మాట్లాడుతూ ఆర్థిక నిర్వహణ అంటే డబ్బును సమర్థవంతగా తెలివిగా ఉపయోగించి ఆర్థిక లక్ష్యాలు నెరవేర్చుకోవటమే అన్నారు. డబ్బు వినియోగించుకునే ముందు ప్రణాళిక, నిర్వహణ, నియంత్రణ ఉండాలన్నారు. పొదుపై కూడా ప్రత్యేక శ్రద్ధ ఉండాలని సూచించారు. కిశోర బాలికల తల్లులు డ్వాక్రా ద్వారా పొదుపు చేస్తున్నారని తెలిపారు. తల్లులు ఇచ్చే పాకెట్ మనీ కిడ్డీ బ్యాంక్లో దాచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శి వికల్ప, వీవో కె.లలితప్రసన్న, అంగన్వాడీ కార్యకర్తలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

బందరు కాలువలోకి మురుగునీరు

పట్టించుకోని అధికారులు


బందరు కాలువలోకి మురుగు నీరు వదిలేందుకు వేసిన పైప్లైన్

పెనమలూరు: రియల్ఎస్టేట్ వ్యాపారులు పాపభీతి లేకుండా వ్యాపారాలు చేస్తూ కాసులు కూడబెట్టుకుంటున్నారు. గోసాలలో ఓ రియల్ఎస్టేట్ వ్యాపారి కాలనీలో మురుగునీటిని ప్రత్యేకంగా పైప్ లైన్ వేసి నేరుగా బందరు కాలువలోకి వదిలేస్తున్నారు. అయినా ఏ ఒక్క అధికారి కూడా స్పందించకుండా చోద్యం చూస్తున్నారు. దిగువ ప్రాంతాలకు తాగు, సాగు నీరు అందిస్తున్న బందరు కాలువలో మురుగునీరు వదలటం అత్యంత దారుణంగా మారింది. గోసాలలో వంతెన వద్ద శ్రీసిటీ కాలనీ నిర్మాణం చేశారు. అయితే కాలనీ వాసులు వాడిన మురుగునీరు, వ్యర్థాలు నేరుగా సాగునీరు అందించే బందరు కాలువలోకి వదిలారు. కాలనీ నుంచి నేరుగా పైప్లైన్ వేసి మురుగునీటిని చట్ట విరుద్ధంగా సాగు కాలువలోకి పంపుతాన్నారు. దీనిపై నీటిపారుదల శాఖ, రెవె న్యూ, పంచాయతీ, సీఆర్డీఏ అధికారులు ఎవరూ స్పందించటం లేదు. కాలనీలో మురుగునీరు నేరుగా బందరు కాలువలోకి ఎలా వదులుతారని గ్రామస్తులు అభ్యంతరం తెలుపుతున్నారు. దీనిపై అధికారులు స్పందించక పోతే జిల్లా కలెక్టర్కు ఫిర్యాదు, చేసి న్యాయ పోరాటం చేస్తామంటున్నారు.

నేడు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ స్థాయి సమావేశం

గన్నవరం: స్థానిక బుద్దవరం రోడ్డులోని ఎంపీడీఓ కార్యాలయం ఎదురుగా ఉన్న వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం మధ్యాహ్నం 2 గంటలకు పార్టీ నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ నాలుగు మండలాల అధ్యక్షులు శీలం రంగారావు, నీలం ప్రవీణ్కుమార్, వింత శంకరరెడ్డి, నక్క గాంధీ శుక్రవారం ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి పేర్ని నాని, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ సతీమణి పంకజశ్రీ హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. నియోజకవర్గంలో నెలకొన్న ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై చర్చించి పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ ప్రజాప్రతినిధులు, నేతలు, కార్యకర్తలు, అభిమానులు హాజరు కావాలని పిలుపునిచ్చారు.

ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు సత్కారం


సత్కారం పొందిన ఉద్యోగులతో కమిషనర్ భవానీప్రసాద్

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీలో పని చేస్తున్న ఉద్యోగులు, సిబ్బంది ఉత్తమ సేవలు అందించాలని కమిషనర్ భవానీప్రసాద్ అన్నారు. పోరంకిలో శుక్రవారం కల్యాణ మండపంలో మున్సిపాలిటీ పరిధిలో వివిధ శాఖల్లో పని చేస్తూ ఉత్తమ సేవలు అందించిన 50 మంది ఉద్యోగులను ఆయన సత్కరించి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ భవానీ ప్రసాద్ మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో సచివాలయాల ద్వారా ప్రజా సేవలు, ఇంటి, ఆస్తి, వాణిజ్య పన్నులు వసూళ్లు, పారిశుద్ధ్యం, వివిధ సర్వేలు ఇలా ఉద్యోగులు వారికి కేటాయించిన విధులు సక్రమంగా నిర్వహించినందుకు గుర్తింపుగా ప్రతిభా పురస్కారాలు ఇచ్చి సత్కారం చేశామన్నారు. భవిష్యత్తులో కూడా మున్సిపాలిటీ, సచివాలయాల ఉద్యోగులు ఉత్తమ సేవలు అందించి మున్సిపాలిటీకి మంచి గుర్తింపు తీసుకు రావాలని సూచించారు. ఉత్తమ సేవలు అందించే ఉద్యోగులకు ప్రొత్సాహం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ కిరణ్, మేనేజర్ విజయలక్ష్మి, టీడీపీ నేతలు అనుమోలు ప్రభాకరరావు, దోనేపూడి రవికిరణ్, రామ్కుమార్, మున్సిపాలిటీ, సచివాలయాల ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రకృతి సాగుతో ఆరోగ్యవంతమైన జీవనం



పెరటి మొక్కల విత్తనాలు పంపిణీ చేస్తున్న సుధాకర్

ఆత్కూరు(గన్నవరం): ఆరోగ్యవంతమైన జీవనం కోసం ప్రతిఒక్కరూ ప్రకృతి సాగు పద్ధతిలో పండించిన ఆహార పదార్థాలను మాత్రమే తీసుకోవాలని టీన్ మిషన్స్ డైరెక్టర్ పులిపాక సుధాకర్ సూచించారు. ఉంగుటూరు మండలం ఆత్కూరులోని టీన్ మిషన్స్ ఇన్ ఇండియా ప్రాంగణంలో శుక్రవారం ప్రకృతి సాగులో పెరటి మొక్కల పెంపకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు 12 రకాల కూరగాయలు, ఆకుకూరల విత్తనాలను పంపిణీ చేశారు. అనంతరం సుధాకర్ మాట్లాడుతూ..ఆహార పంటలు, ఆకుకూరల సాగులో రసాయనిక ఎరువుల వినియోగం నానాటికి పెరిగిపోతుందన్నారు. ఈ పరిస్థితిని అధిగమించేందుకు మహిళలు ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పెరటి మొక్కల పెంపకంపై దృష్టి సారించాలని సూచించారు. అందుబాటులో ఉన్న భూమిలో తక్కువ ఖర్చుతో కూరగాయలు, పండ్లు, ఆకుకూరలు పండించుకోవాలని చెప్పారు. అనంతరం పెరటి మొక్కల పెంపకం, పోషణ, సంరక్షణ పద్ధతుల గురించి సంధ్యా, రమాదేవి వివరించారు. టీన్ మిషన్స్ వైస్ చైర్మన్ టి.జైపాల్, వీఆర్ఓ వెంకటేశ్వరరావు, సంస్థ వలంటీర్లు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం



కంకిపాడు: పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం కల్పిస్తున్నామని మద్దూరు పంచాయతీ సర్పంచ్ చిప్పల రామదాసు అన్నారు. గ్రామంలో చేపట్టిన పారిశుద్ధ్య పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. రామదాసు మాట్లాడుతూ కరకట్ట వెంబడి వ్యర్థాలు పడవేస్తున్న ప్రాంతాలను గుర్తించి వ్యర్థాలను తొలగిస్తున్నామన్నారు. ఆయా ప్రాంతాల్లో మొక్కలు నాటి సంరక్షణ చర్యలు చేపట్టాలని వివరించారు. కరకట్ట వెంబడి చేపట్టిన గ్రీన్ ఫెన్సింగ్ పనులను ఈఓ చింతా కిరణ్కుమార్ పర్యవేక్షించారు.

ఎన్హెచ్ డ్రెయిన్లలో పూడికతీత పనులు ప్రారంభం


కొత్తపేట వద్ద డ్రెయిన్లలో పూడికలు తొలగిస్తున్న సిబ్బంది

గన్నవరం: నియోజకవర్గ కేంద్రమైన గన్నవరంలో ఎట్టకేలకు జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న డ్రెయిన్లలో పూడికతీత పనులు చేపట్టారు. గత రెండేళ్లుగా పూడికలు తొలగించకపోవడంతో డ్రెయిన్లలో భారీగా చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయి మురుగునీటి పారుదలకు ఆటంకంగా మారింది. ఫలితంగా వర్ష కాలంలో డ్రెయిన్లలో ఎక్కడికక్కడ నీరు నిలిచిపోయి రోడ్లు జలమయమవుతున్నాయి. అంతే కాకుండా మురుగునీటి పారుదల లేక డ్రెయిన్ల నుంచి తీవ్ర దుర్గంధం వస్తుండడంతో పరిసర ప్రాంత ప్రజలు, దుకాణదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రజల నుంచి వస్తున్న విజ్ఞప్తుల మేరకు స్పందించిన గ్రామ పంచాయతీ అధికారులు ఎన్హెచ్ డ్రెయిన్లలో పూడికతీత పనులకు శుక్రవారం శ్రీకారం చుట్టారు. డ్రెయిన్లలో పెద్ద ఎత్తున్న పేరుకుపోయిన చెత్తాచెదారం, వ్యర్థాలను తొలగిస్తున్నారు. స్థానిక కొత్తపేట వద్ద ప్రారంభమైన పూడికతీత పనులను ఇరువైపులా డ్రెయిన్లలో ఆర్టీసీ బస్టాండ్ వరకు కొనసాగించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి చెన్నకేశవరావు తెలిపారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీ నిధులతో పూడికతీత పనులు చేపట్టినట్లు వివరించారు. డ్రెయిన్లలో పూర్తిస్థాయిలో పూడికలు తొలగించి మురుగునీటి పారుదలను క్రమబద్దీకరించనున్నట్లు తెలిపారు. డ్రెయిన్లలో సిల్ట్ తొలగింపు పనులు సక్రమంగా జరిగేందుకు గ్రామ ప్రజలు, దుకాణదారులు కూడా సహకరించాలని కోరారు.

ఆరోగ్య సమాజమే లక్ష్యంగా యోగాంధ్ర


యోగాంధ్రలో పాల్గొన్న సిబ్బంది, ప్రజలు

మానికొండ(గన్నవరం): ఉంగుటూరు మండలం మానికొండ గ్రామంలో శుక్రవారం యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. మాస్టర్ ట్రైనర్లు విజయ్, మౌలాలి నేతృత్వంలో మానికొండ, తరిగొప్పుల, వేంపాడు గ్రామ సచివాలయాలకు చెందిన సిబ్బంది, ఆయా గ్రామ ప్రజలు పాల్గొన్నారు. ఆరోగ్యవంతమైన జీవనం కోసం ప్రతిఒక్కరూ యోగా చేయాలని ఎంపీడీఓ ఈ.సత్యకుమార్ సూచించారు. యోగాపై ప్రజల్లో చైతన్యం పెంపొందించేందుకు జూన్ 21వ తేదీ వరకు యోగాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మానికొండ గ్రామ పంచాయతీ కార్యదర్శి వీ సూర్యప్రకాష్నాథ్, పలువురు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఉచిత యోగా శిబిరం

పెనమలూరు: గోసాల శాఖ శ్రీవెంకటేశ్వర యోగా సేవా కేంద్రం ఆధ్వర్యంలో చోడవరం గ్రామంలో ఉచిత యోగా శిబిరం నిర్వహిస్తామని యోగాచార్యులు నేరెళ్ల తులసీకృష్ణ తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం వివరాలు తెలిపారు. ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా జూన్ 1వ తేదీ నుంచి చోడవరం గ్రామం శ్రీ కోదండరామస్వామి దేవాలయంలో 28 రోజులు ఉచిత యోగా శిక్షణ ఇస్తామన్నారు. రోజూ ఉదయం 5 గంటల నుంచి 7 గంటల వరకు యోగా శిక్షణ ఇస్తామన్నారు. ఆసక్తి కలిగిన వారు 91333 06804, 98666 22081 నంబర్కు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవాలని సూచించారు.

ఇమ్యూనైజేషన్పై శిక్షణ తరగతులు

పటమట(విజయవాడతూర్పు): వ్యాధి నిరోధక టీకాలు చేసిన వెంటనే తలెత్తే ప్రతికూల పరిస్థితులపై వైద్యులందరికీ అవగాహన ఉండాలని ఎన్టీఆర్ జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ యం.శరత్బాబు తెలిపారు. నిరోధక టీకాలు వేసే వైద్య బృందాలకు ఐఎంఏ హాల్లో రెండు రోజుల నుంచి జరుగుతున్న శిక్షణ తరగతుల్లో శుక్రవారం ఆయన మాట్లాడారు. టీకాల డేటా మూలాలు, ఉపయోగం, ఇమ్యూనైజేషన్ సెషన్ నిర్వహించడం, వ్యాధి నిరోధక టీకాల ద్వారా నివారించే వ్యాధులపై నిఘా, సామర్థ్య నిర్మాణం, పర్యవేక్షణ, క్షేత్ర సందర్శన కోసం ప్రణాళిక తదితర అంశాల గురించి వివరించారు. ఈ సందర్భంగా సిద్దార్థ మెడికల్ కాలేజీ చిన్నపిల్లల విభాగం ప్రొఫెసర్ డాక్టర్ అనిల్ కుమార్ గెస్ట్ లెక్చర్ ఇచ్చారు. ట్రైనర్లుగా సర్వైలెన్స్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ భవానీ, పి.పి.యూనిట్ వైద్యాధికారి డాక్టర్ వాసంతి, యూవిన్ సమన్వయ కర్త శివ శంకర్, వ్యాధి నిరోధక టీకాల శీతలీకరణ నిర్వహణకర్త కోటేశ్వరరావు, శిక్షకులుగా వ్యవహరించారు. డెప్యూటీ డీయంహెచ్ఓ డాక్టర్ ఇందుమతి, డీఎంఐ డాక్టర్ మోతీబాబు, పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు, గ్రామీణ ప్రాంత వైద్యాధికారులు మరియు పర్యవేక్షకులు యలమందయ్య, రాజ్ వర్ధన్, నాగలక్ష్మి పాల్గొన్నారు.

ఆటోనగర్ డీఎంకు ప్రశంసాపత్రం


ప్రశంసాపత్రం తీసుకుంటున్న ఆటోనగర్ డీఎం ప్రవీణ్కుమార్

ఆటోనగర్(విజయవాడతూర్పు):ఇంధనం పొదుపు చేసినందుకు గాను ఆటోనగర్ ఆర్టీసీ డిపో డీఎం కె.ప్రవీణ్కుమార్కు ఆర్ఎం.ఎంవైదానం ప్రశంసాపత్రాన్ని ఇచ్చారు. 2023–24లో 4.73 శాతం వచ్చింది. 2024–25 కు గాను 4.92 శాతం సాధించినట్లు డీఎం ప్రవీణ్కుమార్ తెలిపారు. గురువారం రాత్రి ఆర్ఎం దానం చేతుల మీదుగా ఈ ప్రశంసాపత్రాన్ని తీసుకున్నట్లు ఆయన చెప్పారు. ఈ సందర్భంగా ప్రవీణ్కుమార్ మాట్లాడుతూ ఇంధనం పొదుపు విషయంలో డ్రైవర్లు, గ్యారేజీ సిబ్బందితో పాటు సూపర్వైజర్లు, ఎస్డీఐ సహకారం మరువలేనిదని చెప్పారు. రానున్న రోజుల్లోనూ ఇదే స్ఫూర్తితో ముందుకు వెళతామన్నారు. ఆటోనగర్ డిపోను అన్ని విధాలుగా అభివృద్ధి బాటలోకి తీసుకెళతామన్నారు. కార్యక్రమంలో సీటీఎం జాన్సుధాకర్, డెప్యూటీ సీటీఎం బస్స్టేషన్ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు సిమెంటు రోడ్ల ప్రారంభోత్సవం

విజయవాడరూరల్: ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు శనివారం అంబాపురం, పి.నైనవరం గ్రామాల్లో జరిగే రోడ్లు ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో పాల్గొననున్నారని ఎంపీడీఓ బి.విగ్గిన్స్ తెలియజేశారు. అంబాపురం (పైపులరోడ్డు) గ్రామంలో ఉపాధి పథకం నిధులు, మండల పరిషత్ నిధులు రూ.50 లక్షలతో నిర్మించిన సిమెంటు రోడ్డును, పి.నైనవరం గ్రామంలో ఉపాధి పథకం నిధులు రూ.25 లక్షలతో, మండల పరిషత్ నిధులు రూ.20 లక్షలతో నిర్మించిన రెండు సిమెంటు రోడ్లను ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ ప్రారంభిస్తారని ఆయన తెలియజేశారు. లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేస్తారన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొంటారు.

జగన్మాతకు నృత్య నీరాజనం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు శుక్రవారం పలువురు కళాకారులు నృత్య నీరాజనాలను అర్పించారు. విజయవాడకు చెందిన శ్రీ గాయత్రి నృత్య నికేతన్కు చెందిన 18 మంది చిన్నారులు పలు కీర్తనలకు ఆంధ్రనాట్యం ప్రదర్శన ఇచ్చారు. నృత్యాచారిణి యం. గాయత్రి పర్యవేక్షణలో గోరంట్ల నిహారిక, గహనాశ్రీవల్లిలతో పాటు పలువురు బృంద సభ్యులు ప్రదర్శించిన నాట్యం అందరినీ ఆకట్టుకుంది. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం కళావేదిక వద్దకు చేరుకున్న భక్తులు ఆద్యంతం నాట్య ప్రదర్శనను వీక్షించి చిన్నారులను అభినందించారు. ప్రదర్శన అనంతరం చిన్నారులకు అమ్మవారి దర్శనం కల్పించిన ఆలయ అధికారులు ప్రసాదాలను అందజేశారు.

రేషన్ దుకాణాల్లోనే సరుకుల పంపిణీ

కంకిపాడు: రేషన్ సరుకులు సరఫరా చేసే వ్యాన్లు రద్దు అయిన క్రమంలో జూన్ 1వ తేదీ నుంచి రేషన్ దుకాణాల్లోనే సరుకులు పంపిణీ జరుగుతుందని తహసీల్దార్ వీ.భావనారాయణ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలోని రేషన్ దుకాణాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 8 గంటల వరకు రేషన్ సరుకులు పంపిణీ జరుగుతుందన్నారు. రేషన్ దుకాణాలకు రాలేని వృద్ధులు, దివ్యాంగులకు 5వ తేదీ లోపు రేషన్ డీలరు కార్డుదారు ఇంటికే వచ్చి సరుకులు సరఫరా చేస్తారన్నారు.